ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానం

ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట, ఏప్రిల్ 13: సిద్దిపేట నియోజక వర్గంలోని పలు దేవాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని, అమ్మపోచమ్మ దేవాలయాల్లో జరిగే ఉత్సవాలకు రావాలని ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు శనివారం సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. సిద్దిపేట పట్టణంలోని పారుపల్లివీధిలోని రామాలయం, చింతమడక పట్టాభిరామాలయం, హౌసింగ్ బోర్డుకాలనీ హనుమాన్ దేవాలయం, హరిప్రియనగర్‌లోని అభయాంజనేయ స్వామిదేవాలయంలో ఉత్సవాలకు రావాలని పత్రికలు ఇచ్చారు. చిన్నకోడూరు మండలం ఎల్లాయపల్లిలోని పెద్దమ్మ దేవాలయం, చింతమడకలోని పోచమ్మ దేవాలయం ఉత్సవాలకు రావాలని ముదిరాజ్ కుల సంఘం ప్రతినిధులు, ఆలయ ప్రతినిధులు కోరారు.

మృతుల కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ

వల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 13: మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ రాపల్లి విటోబా సోదరుడు రాజేశం గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబీకులను పరామర్శించారు. కుటుంబీకులను పరామర్శించారు. నంగునూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వల్లపరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబీకులను పరామర్శించారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 13: మండలంలోని తిమ్మాయిపల్లిలో శనివారం మహంకాళీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, బాషాయిగూడెంలోని పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావును ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

నేడు విగ్రహావిష్కరణ

యాదగిరి విగ్రహం

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 13 : తెలంగాణ ఉద్యమకారుడు, 11 ఏండ్ల పాటు కుకునూరుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా బీఆర్ఎస్‌కు సేవలు అందించిన మాజీ ఎంపీటీసీ పోల్కంపల్లి యాదగిరి విగ్రహావిష్కరణ నేడు(ఆదివారం) ఉదయం వ్యవసాయ క్షేత్రం వద్ద చేయనున్నట్లు ఆయన కుమారుడు పీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్ తెలిపారు. విగ్రహావిష్కరణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డీసీసీ సిద్దిపేట అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి హాజరుకానునట్లు తెలిపారు.

విమర్శలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న రాజుగౌడ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 13: భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌పై మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం చేసిన విమర్శలు అర్థరహితమని, బీజేపీ జిల్లా కార్యదర్శి, రేబర్తి ఎంపీటీసీ కూరెళ్ల రాజుగౌడ్ అన్నారు. శనివారం మద్దూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బూర నర్సయ్యగౌడ్ ఎంపీగా ఎంతగానో కృషి చేశారన్నారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో బూర నర్సయ్యగౌడ్‌పై మాజీ ఎమ్మెల్సీ రాజలింగం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు సురేశ్‌గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ, మండల మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, చేర్యాల పట్టణ అధ్యక్షుడు మన్నె సత్యవర్ధన్, నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, కర్రె వీరన్న, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

నిర్వాహకులతో మాట్లాడుతున్న ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్

అక్కన్నపేట, ఏప్రిల్ 13: మండలంలోని జనగామ, అంతకపేట, గొల్లకుంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ సందర్శించారు. నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్ ఏ ధాన్యానికి రూ. 2203, గ్రేడ్ బీకి రూ. 2183 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు భిక్షపతి, తిరుపతి, వీవోఏలు స్వరూప, మంగాదేవి, అంజలి, రాధిక పాల్గొన్నారు.

కరాటే శిక్షణలో భాగంగా మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్న బాలికలు

ఆత్మరక్షణకు కరాటే అవసరం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 13: బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని ధూళిమిట్ట హైస్కూల్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ధూళిమిట్ట మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 'సెల్ఫ్ డిఫెన్స్'లో భాగంగా నెల రోజుల పాటు కరాటే శిక్షణ పొందిన బాలికలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. నెల రోజుల పాటు విజయవంతంగా కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న బాలికలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ మల్యాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినోద్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న విద్యార్థి, యువజన నాయకులు



హుస్నాబాద్ సదస్సుకు హాజరైన విద్యార్థి, యువజన నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు

కరీంనగర్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- అబద్ధాల పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నరు
- మతాన్ని రాజకీయంగా వాడుకుంటున్న బీజేపీకి ప్రజలు గణపాఠం చెప్పాలి
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- హుస్నాబాద్‌లో నియోజకవర్గ స్థాయి యువజన, విద్యార్థి చైతన్య సదస్సు

హుస్నాబాద్, ఏప్రిల్ 13: ఎవరెన్ని కుట్రలు చేసినా కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని పార్టీల అబద్ధపు ప్రచారాన్ని నమ్మి ప్రజలు మోసపోయారని, పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్ పట్టణ శివారులోని శుభం గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ యువజన, విద్యార్థి చైతన్య సదస్సుకు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, తెలంగాణ ఉద్యమ నేత వి.ప్రకాశ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అబద్ధపు పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. మేడిగడ్డకు రిపేర్లు చేసి రైతులకు నీళ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా బీఆర్ఎస్‌పై బురదజల్లి ఎన్నికల్లో లబ్ధిపొందిందన్నారు. కరెంట్ అప్పులు అంటూ ప్రజలను నమ్మించారన్నారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి మూడు మాత్రమే అమలు చేసి మిగతా వాటిని విస్మరించారన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్న బీజేపీని కూడా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఐదేండ్లు ఎంపీగా ఉండి బండి సంజయ్ ఒక్క రూపాయి కూడా తేలేదన్నారు. ఎంపీగా కరీంనగర్ నియోజకవర్గానికి రెండు నేషనల్ హైవేలు, ఒక రైలు మార్గం తెచ్చిన ఘనత తనదేనన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలు, హక్కుల సాధన కోసం మాట్లాడే గొంతుక కోసం వచ్చే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. యువత, విద్యార్థులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యం చేసి అప్పుడు, ఇప్పుడు పరిస్థితి ఎంటో వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, రాష్ట్ర నాయకుడు పేర్యాల రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీలు మానస, మాలోతు లక్ష్మి, స్వప్న, అనిత, జడ్పీటీసీ మంగ, నాయకులు ఇంద్రనీల్‌బాబు, ప్రణీత్‌రావు, పరశురామ్, క్రాంతిరెడ్డి, వంశీధర్‌రెడ్డి, రాజునాయక్, తిరుపతినాయక్, ప్రవీణ్‌కుమార్, చిరంజీవి, వికాస్‌యాదవ్, విజయభాస్కర్, అఫ్రోజ్, తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎండీ అన్వర్, ఆవుల మహేందర్, మామిడి అంజయ్య, ఆకుల వెంకట్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏడు మండలాల నుంచి వచ్చిన విద్యార్థి, యువజన నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొట్టాలి

- వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, హుస్నాబాద్

మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్న బీజేపీని ప్రజలు, యువత, విద్యార్థులు ఐక్యంగా తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. అయోధ్యలో రామమందిరం నిర్మించి ఏదో ఘనకార్యం చేసినట్లు ఓట్లు అడిగేందుకు వస్తున్న బీజేపీ నాయకులను భద్రాది రాముడి దేవాలయంపై నిలదీయాలి. అయోధ్యలోనే రాముడు ఉన్నాడా...భద్రాదిలో లేడా అని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ, ఐటీలను వాడుకొని విపక్షాలను అణిచివేసే కుట్రలు చేస్తున్న బీజేపీని ప్రజలు నమ్మొద్దు. రాష్ట్రంలో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. 2001నుంచి 2014వరకు కేసీఆర్‌తో సమానంగా ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన మాజీ ఎంపీ, ప్రస్తుత ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించడంలో యువత, విద్యార్థులు ముందుండి పనిచేయాలి.

ప్రజలు మోసపోయారు

- వి.ప్రకాశ్, తెలంగాణ ఉద్యమ నేత

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు చేసిన అబద్ధపు ప్రచారాలకు ప్రజలు మోసపోయారు. ఇప్పుడు నిజం తెలుసుకొని గులాబీ జెండా విలువేంటో తెలుసుకున్నారు. తెలంగాణ కంటే ముందు నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం అరిగోసపడ్డాం. వీటి సాధన కోసమే 14 ఏండ్ల పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నాం. పదేండ్ల పాటు తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే. ఇది గమనించకుండా ప్రజలు పాలిచ్చే ఆవును అమ్మి దన్నపోతును కొనుకున్నట్లు కాంగ్రెస్ పార్టీని తెచ్చుకున్నారు. దేశంలో గాడ్సే పాలన నడుస్తోంది. మోదీ నియంతృత్వ పాలనకు తెరపడాలంటే గులాబీ జెండా రెపరెపలాడాలి. యువత, విద్యార్థులు వాస్తవాలను ప్రజలకు వివరించాలి.

యువత చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్

- తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ

యువత చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్ ఆధారపడి ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత నడుస్తున్న కాంగ్రెస్ పాలనకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాలను ప్రజలకు వివరించాలి. రాజకీయాల మార్పు, సామాజిక మార్పులో యువత కీలకపాత్ర పోషించాలి. తెలంగాణ విముక్తి కోసం 2001లో పడిన ఉద్యమ బీజం వల్లనే రాష్ట్రంలో పెను మార్పులు సంతరించుకున్నాయి. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని తృప్తి పరిచేందుకే సరిపోతోంది. మత రాజకీయాలు చేస్తున్న వారిని ఎన్నటికీ నమ్మొద్దు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించడంలో యువత, విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి.

గ్రామీణ ప్రజలను చైతన్యం చేయాలి

- గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులు, యువత గ్రామీణ ప్రజలను చైతన్యం చేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలి. గత ఎన్నికల్లో యూత్, స్టూడెంట్స్ పట్టించుకోక పోవడం వల్ల అబద్ధాల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో యువత కీలకపాత్ర పోషించాలి. తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పరిస్థితిని ప్రజలకు వివరించాలి. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి వినోద్‌కుమార్‌కు భారీ మెజార్టీ వచ్చేలా యువత, విద్యార్థులు పనిచేయాలి.

రేవంత్ సీఎం పదవి తెచ్చుకున్నడు

- రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

మొదట పీసీపీ అధ్యక్ష పదవి కోసం రూ.50కోట్లు, సీఎం పదవి కోసం ఏకంగా రూ.2,500 కోట్లకు ఒప్పందం చేసుకొని రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని వాళ్ల పార్టీ నాయకులే చెప్తున్నారంటే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. తెలంగాణ సొమ్మును కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి దోచిపెట్టడం తప్పా ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ప్రజలకు చేసేదేమీలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్, పరీక్షల ఫలితాల అనంతరం తామే ఉద్యోగాలు ఇచ్చినట్లు నియామక పత్రాలు పంచుకోవడం సిగ్గుచేటుగా ఉంది. రాష్ట్రంలో 1.60లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రావడం ఖాయం.

గోడ పత్రిక ఆవిష్కరణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికను కలెక్టర్ మను చౌదరి శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ..అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వతేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉంటాయని ..ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేశ్‌కుమార్, సిద్దిపేట అగ్నిమాపక శాఖ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజకీయాలకు సంఘంపేరు వాడొద్దు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 13: పార్టీలకు కార్మికులు అతీతమని భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు తోట్ల నర్సింహులు స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం 14 రంగాల కార్మిక సంఘాల నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దుబాల శ్రీశైలం ఎంపీగా పోటీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అందులో భాగంగా ఆదివారం కొండ మల్లయ్య గార్డెన్‌లో కార్మికులతో కలిసి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. శ్రీశైలం చేయాలనుకుంటే రాజకీయం చేసుకోవచ్చు కానీ సంఘం పేరు ఎక్కడా వాడుకోవద్దని సూచించారు. నాయకులు ప్రశాంత్, ఎల్లయ్య, ఎల్లం, శ్రీశైలం,అక్తర్, శ్రీనివాస్,లక్ష్మయ్య, కిషన్,రఫిక్, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చేర్యాల, ఏప్రిల్ 13: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణానికి చెందిన సత్యం ల్యాండ్రీ షాపు ఓనర్ రాచకొండ శ్రీనివాస్ వార్డు కౌన్సిలర్ జుబేదాఎక్బాల్‌తో శనివారం ప్రారంభించారు. సంతోష్‌కుమార్, ప్రభాకర్, భూమిగారి రమేశ్, గుడాల శ్రీనివాస్, రాళ్ల బండి రాఘవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 13 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకుడు, మండల అధ్యక్షుడు కరెడ్ల రాజిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి కోడిపల్లి ప్రశాంత్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేర్గోజు మల్లేశం, పిల్లి రాజు, చింతల కనకయ్య, ఎస్.చంద్రయ్య, టి.నర్సింహులు, పి.హన్మారెడ్డి, మోహిజొద్దీన్, పుట్ట మల్లికార్జున్, రజిత, ప్రసాద్, శ్రీనివాస్, చంద్రమౌళి, పుట్ట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ ఆలయాల్లో పూజలు

పూజల్లో పాల్గొన్న వకులాభరణం దంపతులు

వర్గల్, ఏప్రిల్ 13: వర్గల్ విద్యాసరస్వతీ మాత ఆలయం, నాచగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వర్గల్ సరస్వతీమాత ఆలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు దంపతులు తమ మనువడికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సరస్వతీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాచగిరిక్షేత్రంలో పెద్దసంఖ్యలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించారు.

బియ్యం అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 13 : కొండపాక మండలం జప్తినాచారంలో పారిశుధ్య కార్మికుడు దాసరి రాజు భార్య దాసరి సంపూర్ణ(45) ఇటీవల మృతి చెందింది. శనివారం కాంగ్రెస్ గ్రామ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ కార్మిక విభాగం అధ్యక్షుడు వడ్ల కొండ రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింహులు, కిషన్, ముస్త్యాల మల్లయ్య, యాదగిరి, రమేశ్, మల్లికార్జున్, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల ఇండ్లల్లో సోదాలు

చేర్యాల, ఏప్రిల్ 13: పట్టణంలో పోలీసులు అకస్మాత్తుగా పలువురు వడ్డీ వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పాన్ బ్రోకర్స్, జ్యువెల్లరీ షాపుల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. కొన్ని నెలలుగా చేర్యాల పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు అధిక వడ్డీలకు రైతులు తదితర వ్యక్తుల నుంచి వారి భూములు రిజిస్ట్రేషన్లు చేయించుకుని డబ్బులు ఇస్తున్నారనే సమాచారంతో సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్సై దామోదర్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం పట్టణానికి చెందిన దాదాపు 25 మంది వ్యాపారుల ఇండ్లు, షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సోదాలు చేయడంతో వడ్డీ వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

కోహెడలో..

కోహెడ, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో శనివారం ముగ్గురు వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో పోలీసులు సోదాలు చేశారు. పేర్యాల సుధాకర్‌రావు ఇంట్లో లేకపోగా, గంగం సంతోష్‌రెడ్డి ఇంట్లో లక్షా 75వేల దస్తావేజులు, వేముల శ్రీనివాస్ ఇంట్లో రూ.25 లక్షల నగదు 40 లక్షల డాక్యుమెంట్లు లభించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

దుబ్బాక పట్టణంలో..

దుబ్బాక, ఏప్రిల్ 13: అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. శనివారం దుబ్బాక పట్టణంలో పల్లె కృష్ణగౌడ్ అనే ఫైనాన్స్ వ్యాపారి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. రూ.80,420 నగదుతో పాటు 50 ఇతరులకు వడ్డీకి ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, మరో వంద ఖాళీ ప్రామిసరీ నోట్లు , 12డైరీలు, నాలుగు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో భూంపల్లి ఎస్సై రవికాంత్, ఏఎస్సై వాహిబ్‌పాషా పాల్గొన్నారు.

ప్రజలను పట్టి పీడిస్తే సహించం

మిరుదొడ్డి, ఏప్రిల్ 13: అధిక వడ్డీలతో గ్రామాల్లోని ప్రజలను పట్టి పీడిస్తే సహించమని ఎస్సై పరశురాములు అన్నారు. శనివారం మిరుదొడ్డి టౌన్‌లో ఆయన తన సిబ్బందితో కలిసి శ్రీ రాఘవేంద్ర ఫైనాన్స్ పై దాడులు నిర్వహించారు. రూ.1,67,000 నగదు, 73లోన్ దరఖాస్తులు,13 ప్రామిసరీ ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

వర్గల్, ఏప్రిల్ 13: ములుగు, వర్గల్ మండలాలకు సంబంధించి మండలంలోని గౌరారం వద్ద లక్ష్మీమాధవ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళలు ఎదగాలి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 13: సమాజాన్ని నడిపించే విధంగా మహిళలు ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ లంక రమాదేవి అన్నారు. శనివారం కొండపాకలోని సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమాశంకర్, డిప్యూటీ చైర్‌పర్సన్ రేష్మ, జయశ్రీ, మానసతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదం స్థావరంపై దాడులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 13: మద్దూరు మండలం సలాఖాపూర్ గ్రామ శివారులో జూదం స్థావరంపై శుక్రవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 70వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ యూనూస్ అహ్మద్‌అలీ తెలిపారు. కాసు ఇన్నారెడ్డి, విరుపాక మహేందర్‌రెడ్డి, యిన్నం దినేశ్, రంజిత్‌రెడ్డి, మామిడి గోపీకృష్ణ, దేవిభూపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

సీపీఐలో చేరికలు

చేర్యాల, ఏప్రిల్ 13: కొమురవెల్లి, మద్దూరు మండలాలకు చ